క్లుప్తంగా

కాంట్రాక్ట్ టీచర్లకు వేతనాలివ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ 2008 ద్వారా కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియామకం పొందిన వారికి నాలుగు నెలలు గడిచినా నేటి వరకు వేతనాలు అందలేదని, ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు కోరారు. ఈ మేరకు గురువారం హార్వెస్ట్ పాఠశాలలోని శిక్షణ కేంద్రం వద్ద డీఈఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగూర్‌వలీ, ఉద్దండ్ షరీఫ్, కేశ్యా, వినోదరావు, వీరయ్య పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంరూరల్: మండలంలో అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు డీఈఓ ఎస్.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సాయికుమార్, సూర్యప్రకాష్‌లు మాట్లాడుతూ... జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్న పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ప్రవీణ్, నవదీప్, గంగాధర్, అరుణ్, వినయ్, సంతోష్, అజయ్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

నివాళి

కామేపల్లి: దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తలింగాల క్రాస్ రోడ్డులో వెంకటరెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, మద్దినేని రమేష్ బాబు, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, బాష్‌సింగ్, గండు సాగర్ పాల్గొన్నారు.

సంతాపం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్రాహ్మణ సంఘ నాయకులు నారపరాజు నాగేశ్వరరావు గురువారం ఖమ్మం టేకులపల్లిలో మృతిచెందగా పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జమలాపురపు రామకృష్ణ, న్యాయవాది మామునూరు మురళీధర్‌రావు, మాటూరి లక్ష్మీనారాయణ, చాగంటి రామకృష్ణ, ముడంబ శ్రీకాంత్ ఉన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

ఖమ్మం అర్బన్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించేందుకు మమత వైద్య సంస్థలు ముందుంటున్నాయని మమత వైద్య, విద్యా సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ అన్నారు. ఈ మేరకు గురువారం మమత ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆస్పత్రిలో 150 మందికి మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించడంతో వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ నరేన్, డాక్టర్లు వీరగంధం, సాయి శిరణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, సర్జన్ డాక్టర్ బాలకృష్ణ, ఆస్పత్రి ఏవో టీవీ బాబు, సిబ్బంది ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్, ఏసీఈ
వినోద	సింగిల్
సాయిరాం	ఫైనల్ డెస్టినేషన్: బ్లడ్‌లైన్స్
ఆదిత్య	యమదొంగ, 23
శ్రీనివాస	మిషన్: ఇంపాజిబుల్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	26		20
కాకర	46	చుక్కకూర	3
బీర	50		20
దొండ	24	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	108	గోంగూర	4
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	66		20
బీట్‌రూట్	34	-ఖమ్మం వ్యవసాయం	

లిఫ్ట్ ఇరిగేషన్ నీటితో జలకళ

- నిండుతున్న చెరువులు
- ఎండాకాలంలో జలాలు చేరుతుండడంపై రైతుల్లో హర్షం

రఘునాథపాలెం: మండలానికి ఎప్పటికప్పుడు తాగునీరు, సాగునీటి కష్టాలు కొత్తేం కావు. వర్షాధారంగా మాత్రమే పంటలు సాగు చేసుకుంటూ వచ్చిన మండల రైతులకు ఇప్పుడు సాగర్ జలాల రూపంలో కొత్త ఆశాజ్యోతి కనిపిస్తోంది. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా మండలంలోని కొన్ని చెరువులు నీటితో నిండిపోవడం, ఎండాకాలంలోనూ నీటి కొరత లేకుండా ఉండడం రైతులను ఆనందాశ్చర్యాలకు గురి చేస్తోంది. ఇన్నేళ్లుగా సాగర్ జలాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు రూ.65 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు రైతుల బతుకులను మార్చే భగీరథంగా కనిపిస్తోంది.

34 చెరువులకు నీరందించేలా..

వీవీ పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వపై నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తిగా పైపు లైన్లు, ఫీల్డ్ చానల్స్ ఆధారంగా రూపొందించబడింది. మొత్తం 34 చెరువులకు సాగర్ జలాలను అందించేందుకు ప్రత్యేక డిజైన్‌తో పైపులైన్లు వేసి, తాత్కాలికంగా మోటార్ ఏర్పాటు చేసి గత పదిహేను రోజులుగా ట్రయల్ రన్ ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని మంచుకొండ, మల్లేపల్లి, బావోజీతండా తదితర గ్రామాల పరిధిలో మస్తాన్ కుంట, మొగిలిచెరువు, నల్లకుంట, రేగులకుంట వంటి చెరువులు నిండిపోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు నీటి కొరత తీరింది. వేసవిలోనూ వర్షం లేకుండా నీటి అలుగులు పారడమనేది ఇదే మొదటిసారి. గతంలో ఎండిపోయిన చెరువులు ఇప్పుడు కళకళలాడుతుండటంతో రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

4 వేలకు పైగా ఎకరాలకు నీరు..

నీటి పరంగా తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొన్న మండలానికి ఇది గొప్ప ఊరటనిచ్చే పరిణామంగా అధికారులు అభివర్ణిస్తున్నారు. ఈ లిఫ్ట్ ప్రాజెక్టుతో సుమారు 4 వేల ఎకరాలపైగా సాగు భూములకు సాగునీరు అందనుండడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. నీటి కొరతతో గతంలో వ్యవసాయం వదిలేసిన కొందరు రైతులు మళ్లీ సాగు వైపు అడుగులు వేయాలని భావిస్తున్నారు. మూడు మోటార్లతో నీటి సరఫరా అందేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు మండల రైతాంగానికి వరంగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు. మండలాన్ని కరువు మండలంగా పరిగణిస్తూ సాగునీటి కోసం ఎన్నో వినతులు చేసిన రైతులకు, గ్రామస్తులకు ఇప్పుడు ఈ ప్రాజెక్టు రూపంలో పరిష్కార మార్గం లభించినట్లయింది. పచ్చని పొలాలు, నీటితో కళకళలాడుతున్న చెరువులు ఈ ప్రాంత భవిష్యత్‌ను మరో కోణంలోకి తీసుకెళ్తున్నాయి. ట్రయల్ రన్ ద్వారానే చెరువుల్లో నీరు చేరడంతో ఆయా ప్రాంతాల్లో రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకాలు చేయడం చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చెరువుకు లిఫ్ట్ నీరు తరలిస్తున్న దృశ్యం


ప్రత్యేక పైపులైన్ ద్వారా చెరువుకు వస్తున్న సాగర్ జలాలు

రైతుల సహకారంతోనే..



ఈ ప్రాజెక్టును నాలుగు నెలల వ్యవధిలోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేశాం. పంటలు ఉన్న సమయాన పైపులైన్ పనులకు రైతులు సహకరించడంతో శరవేగంగా చేసి ట్రయల్ రన్ ద్వారా నీటి సరఫరా కొనసాగుతోంది. త్వరలోనే నీటి సరఫరా నిలిపేసి కంపెనీ మోటార్లు, పంపులు అమర్చే పనులు చేపడతాం. వచ్చే వ్యవసాయ సీజన్ కల్లా పూర్తి స్థాయిలో సాగు నీరు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఝాన్సీ, జలవనరులశాఖ డీఈ, రఘునాథపాలెం

ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టాలి


మాట్లాడుతున్న వెంగళరావు

నేలకొండపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటును పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.. డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను వారి మాతృ స్థానానికి వెళ్లలేదని, దాని వలన అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థికపరమైన బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు గత మూడేళ్ల నుంచి చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. 2024లో చేపట్టిన కులగణనకు సంబంధించి రెమ్యూనిరేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కె.గోవిందరావు, బీ.రామారావు, చీనా, కోటేశ్వరరావు, అనిల్, అనిల్, నాగేశ్వరరావు, జ్యోతిర్మయి, జ్యోతి, కోటేశ్వరరావు, వీరబాబు, సురేష్, రాంబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న దయాకర్ రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: గ్రామీణ క్షేత్రాలలో వైద్యం చేసే ఆర్ఎంపీలకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించే అంశాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం టీటీడీసీ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్ అధ్యక్షతన తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 11వ మహాసభలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ గ్రామీణ వైద్యుల గుర్తింపునకు, చట్టబద్ధతకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త స్వర్ణ భాస్కర్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ సాదిక్ అలీ, వ్యవస్థాపక అధ్యక్షులు నజిరుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జానీమియా, జిల్లా కోశాధికారి షేక్ బాబు సాహెబ్, నాయకులు ఖాసిం, చాంద్ పాషా, పాషా, మహమ్మద్ సాహెబ్, అమీర్, జానీ, జానీమియా, రంజాన్ పాషా, లానా, అఖిల్ అహ్మద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కామేపల్లి: నేడు(శుక్రవారం) కొండాయిగూడెం సొసైటీ కార్యాలయంలో ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందిస్తున్న విత్తనాలను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు, రైతులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వైభవంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి వేడుకలను గురువారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల కమిటీలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పలు చోట్ల శోభాయాత్రలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బాలాంజనేయ ఆలయంలో హనుమాన్ చాలీసా పుస్తకాల పంపిణీ


ఖమ్మంఅర్బన్: చైతన్య నగర్‌లో..


నేలకొండపల్లి: కోరట్లగూడెంలో..


కూసుమంచి: జీళ్లచెరువులో..


కామేపల్లి : హనుమాన్ చాలీసా పారాయణం..


తిరుమలాయపాలెం: పైనంపల్లిలో..

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి


అవగాహన కల్పిస్తున్న ఏఓ తారాదేవి

కామేపల్లి: రైతులు నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని ఏఓ భూక్యా తారాదేవి అన్నారు. గురువారం గోవింద్రాల గ్రామంలో రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డీలర్లు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఉష, రాంబాబు, రాందాస్, సక్రాం తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు అధికారులు గురువారం కేఎంసీలో విధుల్లో చేరారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌తోపాటు సత్తుపల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సీహెచ్.శ్రీనివాస్ కేఎంసీలో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు వీరు కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలిశారు

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

రఘునాథపాలెం: మండల పరిధిలోని రైతుల కోసం ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఏఓ కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచుకొండ, రఘునాథపాలెం సొసైటీల ద్వారా జనములు, జీలుగులు విత్తనాలను రైతులు సబ్సిడీ ధరకే పొందవచ్చని, అవసరమైన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు సంబంధిత క్లస్టర్ రైతువేదిక వద్ద ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి కూపన్ తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సమీప సొసైటీలో కూపన్ చూపించి విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: ఉపాధిహామీ కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి. సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఎంపీడీఓ కుమార్‌కు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధి పథకానికి బడ్జెట్‌లో సరైన నిధులు నిధులు కేటాయించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడం పాలకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, బాలరాజు, శ్రీను, ఎస్. కృష్ణ, కె. రాములు, ఏపూరి మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పథకాల అమలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలో పర్యటించిన మంత్రి ముత్తగూడెం వద్ద రుమలాయపాలెం- తాళ్లేసేతండా రోడ్లను రెండు వరుసల రోడ్డుగా అభివృద్ధి, ఎన్ఎస్పీ కెనాల్‌పై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు, ఎం.వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాలలో ర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి, స్నేకల్ నుండి పిట్టలవారిగూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, కాచిరాజుగూడెం వద్ద చింతపల్లి నుండి కాచిరాజుగూడెం వరకు డబుల్‌రోడ్ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంవీ పాలెంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి మంజూరు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకూబ్, ఆర్‌డీఓ నర్సింహారావు, తహసీల్దార్ పి.రాంప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

మాతా, శిశు సంక్షేమానికి అంగన్‌వాడీ కీలకం


స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: తల్లి, శిశు సంక్షేమానికి అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణం కీలకమైందని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. గురువారం కమిషనర్ 46వ డివిజన్‌లో కొత్తగా అంగన్‌వాడీ సెంటర్ నిర్మించడం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, చిన్నపిల్లలకు పోషకాహారం, విద్య, ఆరోగ్య పరిరక్షణ సేవలు అందించే లక్ష్యంతో ఈ సెంటర్‌ను నిర్మించేందుకు కసరత్తు ప్రారంభించినట్లు కమిషనర్ తెలిపారు. త్వరితగతిన అంచనా సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో పాటు ఇంజనీరింగ్ విభాగం అధికారులు కూడా పాల్గొన్నారు.

వరద ముప్పు లేకుండా చూడాలి

ఖమ్మం అర్బన్: కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అండర్ డ్రెయినేజీ, కాల్వ విస్తరణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ గురువారం పరిశీలించారు. నగరంలోని 6, 10, 11, 41వ డివిజన్లతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... రూ.250 కోట్ల వ్యయంతో డ్రెయినేజీ, కాల్వ విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. కాల్వ విస్తరణలో భాగంగా, కాల్వకు ఆనుకొని ఉన్న కొన్ని ఇళ్ల ప్రహరీ యజమానుల సహకారంతో తొలగించామన్నారు. కార్పొరేటర్ రమాదేవి సతీష్ తదితరులు ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న మేయర్ నీరజ

నోట్‌బుక్స్, బాటిళ్ల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పరిధిలోని దానవాయిగూడెం డంపింగ్‌యార్డ్, ఫ్రీడం పార్క్‌లో అమృత్ మిత్ర వాటర్ ఫర్ ఉమెన్ (ఎస్ఎస్‌జీ) సంఘ సభ్యులకు నోట్ పుస్తకాలు, వాటర్ బాటిళ్లను మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. అనంతరం డంపింగ్ యార్డ్‌లోని మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. కార్పొరేటర్లు బందే నిరంజన్, పగడాల శ్రీవిద్య, బట్టపోతుల సతీష్, హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక, ఏవో శ్రీకాంత్, మెప్మా డీఎం సుజాత, ఏఎంసీ సుజాత, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌పై కుట్ర

ఖమ్మంమయూరిసెంటర్: కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల సాగునీటి పథకమని, దీని నిర్మాణంలో అక్రమాలు జరిగాయనే నిందారోపణలతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి జీవనాడిగా నిలిచిన ఈ ప్రాజెక్టు లక్షల ఎకరాల బీడు భూములకు సాగునీరందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాక ప్రజల దాహార్తి తీర్చిందని తెలిపారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం పథకం కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు సాధించి దేశ నీటి పారుదల రంగంలో సరికొత్త రికార్డులు సృష్టించిందని పేర్కొన్నారు.

ఎంవీ పాలెం మండలాన్ని తక్షణమే ప్రకటించాలి

ఖమ్మంరూరల్: ఎం.వెంకటాయపాలెం కేంద్రంగా కొత్త మండలాన్ని తక్షణమే ప్రకటించాలని అఖిల పక్షం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన అఖిల పక్షం నాయకుల సమావేశంలో ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్షం నాయకులు నంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఎంవీపాలెంను నూతన మండలంగా చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఏర్పాటు దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. పరిపాలనా సౌలభ్యం కోసం, ప్రజలందరికీ అందుబాటులో ఉండే ఎంవీపాలెంను మండలం చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు సత్యం, పుల్లయ్య పాల్గొన్నారు.

'వివక్ష చూపిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలి'


తిరుమలాయపాలెం: ఎర్రగడ్డ చోరీ కేసులో అగ్రవర్గానికి చెందిన యువకుడు ఉన్నప్పటికీ దళిత యువకుడి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎర్రగడ్డ గ్రామంలో ఈ నెల 3న ఓ ఇంట్లో చోరీ జరగగా దారమళ్ల సందీప్‌తో పాటు అగ్రవర్గానికి చెందిన మరో వ్యక్తి పాత్ర కూడా ఉన్నట్లు తెలిసినప్పటికీ ఎస్సై మాత్రం సందీప్‌ను బెదిరింపులకు గురిచేశాడని, అభిలాష్ పేరు కాకుండా వేరు వ్యక్తి పేరు చెప్పాలని ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. బాధ్యుడైన ఎస్సైపై చర్యలు తీసుకోవడంతో పాటు సందీప్‌కి మెరుగైన వైద్యం అందించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాగభూషణం, శ్రీను, నాగేశ్వరరావు, స్వామి, ఆనందరావు, పోలెపొంగు వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించాలి

ఖమ్మంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన ఉంటుందనే భరోసా విద్యార్థుల తల్లిదండ్రుల్లో కల్పించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆదిశగా అందరూ కృషి చేయాలని జిల్లా ఏఎంఓ కె.రవికుమార్ అన్నారు. మండలంలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న వృత్యంతర శిక్షణను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలల్లో ప్రభుత్వ బడుల్లో ఎక్కువ మంది విద్యార్థుల చేరికకు తమవంతు ప్రయత్నం చేయాలని, చేరిన విద్యార్థులకు మంచి బోధన అందించాలన్నారు. ఎంఈఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా ప్రణాళికలను ఉపాధ్యాయులు సిద్ధం చేసుకోవాలని ఎంఈఓ బి.చలపతిరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో మూడో రోజు వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... బడి బాటలో విద్యార్థులను చేర్పించేందుకు ముందుగా తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్, టి.వెంగళరావు, టి.గురవయ్య, కె.గోవిందరావు, శ్రీనివాస్, వీరబాబు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల మూసివేత తగదు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రవ్యాప్తంగా 12 ఎస్సీ గురుకులాలలో జూనియర్ కాలేజీలో మూసివేత నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందా సురేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఖమ్మం క్యాంపులో గల సోషల్ వెల్ఫేర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఉన్న సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూసుమంచి బాలికలు, సత్తుపల్లి బాలురు, భద్రాచలం బాలికలు, ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యార్థులు లేరని సాకుతో కళాశాల మూసివేత నిర్ణయం తగదన్నారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలను ఎత్తివేయాలన్న ఆలోచనను ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ సంక్షేమ అధికారులు ఈ నిర్ణయాన్ని విరమించుకోకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు పైండ్ల శ్యామల, శివ నాయక్, వినోద్ వంశీ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.